ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ EVENING

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 85 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

సోమవారం 28 అక్టోబర్ 2024

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ఆర్థిక నేరస్థుడు 11 ఏళ్లుగా బెయిల్పై ఉండటమేంటి?: యనమల

**తల్లి, చెల్లిపై కేసులేయడంతో జగన్ పాతాళానికి కూరుకుపోయారని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు.**



అమరావతి,అక్టోబర్ 28 (రిపబ్లిక్ న్యూస్): తల్లి, చెల్లిపై కేసులేయడంతో వైకాపా అధ్యక్షుడు జగన్ పాతాళంలో కూరుకుపోయారని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఆయన చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళంలోకే అని ఎద్దేవా చేశారు. ఆస్తుల వివాదం కాదు.. ఇది రాజకీయ ఆత్మహత్యే అని పేర్కొన్నారు. చివరికి జగన్ తన సొంత తల్లి, చెల్లిని కూడా మోసం చేశారన్నారు. షర్మిలకు ఇచ్చిన రూ.200 కోట్లు ఆయనకు ఎక్కడివని ప్రశ్నించారు. రూ.200 కోట్లు ఇచ్చానని పేర్కొన్నా.. ఐటీ, ఈడీ ఎందుకు స్పందించట్లేదన్నారు. "ఒక ఆర్థిక నేరస్థుడు 11 ఏళ్లుగా బెయిల్పై ఉండటమేంటి? ఇప్పటికే అనేక మంది వైకాపాను వీడుతున్నారు. భవిష్యత్తులో జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారనుకోవడం పగటి కలే. ఇవాళ కాకపోతే రేపైనా జగన్ జైలుకెళ్లడం ఖాయం. పాత కేసులకు తోడు కొత్త కేసులు ఆయనపై సిద్ధంగా ఉన్నాయి" అని యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు.

# ఆ ఫుట్బాల్ ఫీవర్ భారత్లోనూ ఉంది:ప్రధాని మోదీ

**స్పెయిన్ ప్రధాని గుజరాత్ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి ఫుట్బాల్ ఆటపై స్పందించారు.**



వడోదర, అక్టోబర్ 28 (రిపబ్లిక్ న్యూస్): లాలిగా టోర్నీలో భాగంగా రియల్ మాడ్రిడ్ జట్టును బార్సిలోనా 4-0 తేడాతో ఓడించింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్ విజయం తాలుకా ప్రతిధ్వనులు ప్రపంచవ్యాప్తంగా వినిపించాయి. అవి గుజరాత్ను చేరాయి. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఆ విషయం ప్రస్తావించారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ గుజరాత్లోని వడోదర పర్యటన సందర్భంగా.. స్పానిష్ ఫుట్బాల్ ఆటకుండే ఆదరణపై మోదీ స్పందించడం విశేషం. రియల్ మాడ్రిడ్పై బార్సిలోనా సాధించిన విజయాన్ని మోదీ ప్రస్తావిస్తూ.. ఈ మ్యాచ్ గురించి స్పెయిన్లో మాదిరిగానే భారత్లోనూ ఎంత ఉద్వేగభరితంగా చర్చించుకున్నారని వివరించారు. "స్పానిష్ ఫుట్బాల్ ఆటను భారత్ ప్రజలు ఎంతో ఇష్టపడతారు. నిన్న జరిగిన రియల్ మాడ్రిడ్, బార్సిలోనా మ్యాచ్ గురించి ఇక్కడా చర్చించుకున్నారు. బార్సిలోనా అద్భుత విజయం ఇక్కడ కూడా చర్చనీయాంశమైంది. ఈ రెండు క్లబ్ల అభిమానుల మధ్య సరదా వాతావరణం స్పెయిన్ లో మాదిరిగానే భారత్లోనూ నెలకొందని నేను చెప్పగలను" అని వడోదర రోడ్షో ప్రసంగిస్తూ మోదీ వివరించారు. ఈ ప్రసంగం విన్న తర్వాత ప్రధాని మోదీ ఫుట్బాల్ పరిజ్ఞానంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆయన తన ప్రసంగంతో అందర్నీ ఆశ్చర్యపరిచారని కొనియాడుతున్నారు. ఇక ఈ రోడ్షో ఇద్దరు ప్రధానులు పాల్గొన్నారు. ఎయిర్పోర్టు నుంచి టాటా ఎయిర్ క్రాఫ్ట్ కాంప్లెక్స్ వరకూ 2.5 కి. మీ. మేర సాగిన ఈ రోడ్ షోలో ఇద్దరు నేతలు ప్రజలకు అభివాదం చేస్తూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. టాటా అడ్వాన్స్ సిస్టమ్ను వీరిద్దరూ కలిసి ప్రారంభించారు. అనంతరం చర్చలు జరిపేందుకు చారిత్రక లక్ష్మీవిలాస్ ప్యాలెస్కు బయలుదేరి వెళ్లారు. అక్కడ ఇరుదేశాల నేతల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ చర్చలు ఇరుదేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని మోదీ అన్నారు.

# ఏపీ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

**ఏపీ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. వారితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు..**

అమరావతి,అక్టోబర్ 28 (రిపబ్లిక్ న్యూస్): ఏపీ హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. వారితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. హైకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ చల్లా గుణరంజన్, జస్టిస్ మహేశ్వరరావు కుంచం, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ ప్రమాణం చేశారు.



# మోమోస్ తిని మహిళ మృతి.. 50 మందికి అస్వస్థత

**మోమోస్ తిని మహిళ మృతిచెందగా.. 50 మంది అస్వస్థతకు గురయ్యారు.**



జూబ్లీహిల్స్,అక్టోబర్ 28 (రిపబ్లిక్ న్యూస్): మోమోస్ తిని మహిళ మృతిచెందగా.. సుమారు 50 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. అస్వస్థతకు గురైన వారు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.బాధితుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందినగర్, సింగాడకుంట బస్తీ, గౌరీ శంకర్ కాలనీలో శుక్రవారం జరిగిన సంతలో మోమోస్ విక్రయించారు. సింగాడకుంట బస్తీకి చెందిన రేష్మ బేగం (31)తో పాటు ఆమె పిల్లలు, ఆయా బస్తీల్లోని సుమారు 50 మంది వీటిని తిన్నారు. వీరందరికీ శనివారం నుంచి వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. దీంతో బంజారాహిల్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని పలు ఆస్పత్రుల్లో చేరారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మోమోస్ తిన్నవారిలో దాదాపు 10 మంది మైనర్లు ఉన్నారు. రేష్మ బేగం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో ఆమె మృతిచెందారు. ఈ సంఘటనపై ఇప్పటికే బాధితులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో మోమోస్ విక్రయించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ను ఆశ్రయిస్తున్నారు. మోమోస్తోతో పాటు ఇచ్చే మయోనైజ్, మిర్చి చట్నీ కలుషితమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

# హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందుకు యత్నిస్తే ఊరుకోం: మంత్రి పొన్నం

**రాజకీయంగా ఎవరి మీదా కేసు పెట్టాలని ప్రభుత్వం చూడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**



హైదరాబాద్,అక్టోబర్ 28 (రిపబ్లిక్ న్యూస్): ,రాజకీయంగా ఎవరి మీదా కేసు పెట్టాలని ప్రభుత్వం చూడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్వాడ ఫామ్స్ పార్టీ వ్యవహారంలో అర్ధరాత్రి డీజే సౌండ్ పెట్టి చుట్టుపక్కల వాళ్లకు ఇబ్బంది కలిగించారని చెప్పారు. ప్రభుత్వానికి ఎవరి మీదా కక్ష సాధింపు చర్యలు లేవని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేందు యత్నిస్తే ఊరుకోమని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# కంటైనర్ టెర్మినల్ను పునరుద్ధరించాల్సిందే: సోమిరెడ్డి


**కంటైనర్ టెర్మినల్ను పునరుద్ధరించాల్సిందేనని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డి తెలిపారు.**



నెల్లూరు, అక్టోబర్ 28 (రిపబ్లిక్ న్యూస్): కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ను పునరుద్ధరించాల్సిందేనని మాజీ మంత్రి, తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డి డిమాండ్ చేశారు. జగన్ హయాంలో ఎత్తేసిన ఈ టెర్మినల్ మూతపడటంతో 10 వేల ఉద్యోగాలు పోయాయన్నారు. కృష్ణపట్నం పోర్టు వద్ద ఆయన నిరసన తెలిపారు. అఖిలపక్ష నేతలతో కలిసి పోర్టు సీఈవోను సోమిరెడ్డి నిలదీశారు. టెర్మినల్ను పునరుద్ధరించాలని కోరారు. తొలుత పోర్టులోకి వెళ్లకుండా సోమిరెడ్డిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు.

# కాళేశ్వరం డీపీఆర్ను కేసీఆర్ ఆమోదించారు: మాజీ ఈఎన్సీ వెంకటేశ్వర్లు

**విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై విచారణ సాగింది.**



హైదరాబాద్, అక్టోబర్ 28 (రిపబ్లిక్ న్యూస్): విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై విచారణ సాగింది. కాళేశ్వరం డీపీఆర్ను అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదించినట్లు విచారణ సందర్భంగా వెంకటేశ్వర్లు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన దస్త్రాలను కమిషన్కు అందించారు. కాళేశ్వరం డిజైన్లను ఫైనల్ చేయమని కేసీఆర్ చెప్పినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. మినిట్స్కు సంబంధించిన దస్త్రాలు, మూడు బ్యారేజీల వివరాలను సమర్పించారు. మేడిగడ్డ కుంగుబాటుకు నిర్వహణ లోపమే కారణమా? మూడు బ్యారేజీల్లో నీరు నింపాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి అప్పటి ప్రభుత్వాధినేత ఆదేశించారని వెంకటేశ్వర్లు బదులిచ్చినట్లు సమాచారం.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# నూనెపల్లి బ్రిడ్జి కింద జరుగుతున్న ఆక్రమణల తొలగింపు

నంద్యాల నూనెపల్లె, అక్టోబర్,28 (రిపబ్లిక్ న్యూస్): పట్టణంలోని నూనెపల్లె బ్రిడ్జి క్రింద ఉన్న దుకాణాలను సోమవారం తొలగించడం జరిగింది. గత 30 ఏళ్ల ఉన్న దుకాణాలు ఉన్నాయి. చాల మందికి ఉపాధిగా ఉన్న ప్రదేశాల నుండి దుకాణాలను తొలగించడం యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికప్పుడు మా దుకాణాలను తీసివేయడంతో ఏ ఉపాధి లేకుండా మేము రోడ్డున పడతామని యజమానులు, కూలీలు అంటూన్నారు. అధికారులు మాకు ఉపాధి చూపించాలని దుకాణాదారులు అన్నారు. కొత్త మంది బ్రిడ్జి క్రింద ఉన్న ప్రదేశాలను ఆక్రమణలు చేసి దుకాణాలను ఏర్పాటు చేసి బడుగకు ఇచ్చారు. మరి కొత్త మంది సొంతంగా దుకాణాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. పట్టణంలో నడ్డిబొడ్డు ఆక్రమణలు చేసిన పట్టించుకోవడం లేదు. పేదలమైన మా చిన్న దుకాణాలను తొగిస్తూ మాకు ఉన్న ఉపాధిని కుడా లేకుండా చేస్తున్నారని దుకాణాదారులు ఆవేదన చెందుతున్నారు.

## పట్టణాన్ని సుందరంగా ఉంచడంలో చేసే మా ప్రయత్నానికి ప్రజలు సహకారాన్ని అందించాలి

## మున్సిపల్ కమీషనర్ నిరంజన్ రెడ్డి

నంద్యాల జిల్లాగా రూపుదిద్దుకున్న తర్వాత పట్టణంలో అతి ముఖ్యమైన రహదారుల వెంట కూడా ఆక్రమణలు చేసి ప్రజలకు అసౌకర్యం కల్పించడం, కొంతమంది స్థలాలను ఆక్రమించుకొని బాడుగలకు ఇచ్చుకొని వ్యాపారాలు చేసుకోవడం వలన పట్టణాన్ని గ్రామీణ వాతావరణంలో చూపించే ప్రయత్నం జరుగుతుంది. దీన్ని అంతటిని కూడా గమనించి ఒక మంచి వాతావరణాన్ని కల్పించేలా ఈ ప్రదేశాలను శుభ్రం చేయించి అభివృద్ధి చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆలోచన తోటి మీ ఆక్రమణాల తొలగింపులు చేయడం జరిగింది. ఈ ఆక్రమణల తొలగింపులో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు, జిల్లా వివిధ శాఖల అధికారులు, విద్యుత్ శాఖ, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, అన్ని శాఖల అధికారులు కూడా సమన్వయంతో పనిచేసే ఆక్రమణ తొలగింపుకు కృషి చేశారు. ప్రజలందరూ కూడా ఈ కార్యక్రమానికి సహకరించి వారి యొక్క పట్టణాన్ని సుందరంగా ఉంచడంలో చేసే మా ప్రయత్నానికి ప్రజల యొక్క సహకారాన్ని అందించాలని కోరుతున్నాను. రానున్న



రోజుల్లో ప్రభుత్వ స్థలాలలో ఉన్న ఆక్రమణలను కూడా తొలగించడం జరుగుతుంది





# తప్పులన్నీ మీరు చేసి.. కూటమి ప్రభుత్వంపై విమర్శలా?: జగన్కు గొట్టిపాటి కౌంటర్

వైకాపా అధినేత జగన్కి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కౌంటర్ ఇచ్చారు.



అమరావతి,అక్టోబర్,28 (రిపబ్లిక్ న్యూస్): వైకాపా అధినేత జగన్కి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కౌంటర్ ఇచ్చారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై మాట్లాడే కనీస అర్హత మీకు ఉందా? అని ప్రశ్నించారు. మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీని అప్పగిస్తే వ్యక్తిగత స్వార్థంతో నాశనం చేసింది మీరు కాదా అని ధ్వజమెత్తారు. వైకాపా అసమర్థ పాలన, అస్మదీయులకు దోచిపెట్టింది వాస్తవం కాదా అని నిలదీశారు. పీపీఏలను రద్దు చేయడం, ఉత్పత్తిదారులను భయపెట్టడంతో కేంద్ర ప్రభుత్వం, విదేశీ బ్యాంకుల వద్ద రాష్ట్రం పరువు పోవడానికి మీరు కారణం కాదా జగన్.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు."2022-23, 2023-24 సంవత్సరాలకు గాను ఇంధన సర్దుబాటు ఛార్జీలను ప్రజలపై మోపాలని డిస్కంలకు అనుమతి ఇచ్చింది మీరే కదా. తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల రక్తం తాగారు. అలాంటి మీరు చంద్రబాబు పాలనను విమర్శించడమేంటి? మీరు చేసిన తప్పిదాలతోనే కదా అనవసరంగా హిందూజా పవర్కు రూ.1200 కోట్లు కట్టాల్సి వచ్చింది. వైకాపా హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. పోలవరం పూర్తి చేస్తానన్నారు.. చేయలేదు. మూడు రాజధానులు నిర్మిస్తానని చెప్పి రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించారు. తప్పులన్నీ మీరు చేసి.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడమేంటి?" అని ప్రశ్నించారు.

# ఎంప్లాయర్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కేంద్ర అధ్యక్షుడు

కల్లూరి పెద్ద మస్తానయ్య కుమార్తె హరిస సుల్తానా వివాహ వేడుకలో పాల్గొని, వధూవరులకు షాదీ ముబారక్ తెలియజేసిన సబ్ డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎన్జీవో- ఎస్.షర్ఫుద్దీన్ అలి



ఆత్మకూరు అక్టోబర్ 28 (రిపబ్లిక్ న్యూస్):ఆత్మకూరు పట్టణంలోని, సిద్ధపల్లె రస్తాలో ఉన్న ఎల్.వి.కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో ఎంప్లాయర్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కేంద్ర అధ్యక్షుడు కల్లూరి పెద్ద మస్తానయ్య కుమార్తె కల్లూరి హరిస సుల్తానా పెళ్లి వేడుకలో సబ్ డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెం--బర్ - ఎస్. షర్ఫుద్దీన్ అలి పాల్గొని నూతన వధూవరులు డి. మొహమ్మద్ షఫీ(ఎంసీఏ), కల్లూరి హరిస సుల్తానా(బీటెక్) లకు షాదీ ముబారక్ తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సాఫ్ట్వేర్ ఇంజనీర్ లైన్ నూతన వధూవరులు కల్లూరి హరిస సుల్తానా, డి.మొహమ్మద్ రఫీ లకు జరిగిన వివాహా నిఖాలో అల్లా దయతో కలకాలం ఇద్దరు సుఖ సంతోషాలతో జీవించాలని పెళ్లికి వచ్చిన అందరూ దువా చేయడం జరిగింది . ఈ పెళ్లి వేడుకలలో ఆత్మకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్-డాక్టర్-ఏ.రాయుడు, కొత్తపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ -మహమ్మద్ బేగ్, గోకవరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్-విజయేంద్ర, శ్రీశైలం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవాణి, బైర్లూటి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవన్ కుమార్, పాములపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల కాంపౌండర్ డి. మహబూబ్ బాషా, హెల్త్ సూపర్వైజర్లు బాలకృష్ణ, ర్రప్ప,ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ యూనియన్ లీడర్లు వెంకటరమణ, ఎస్ఆర్బిసి మరియు ఫారెస్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఫారెస్ట్ ఆఫీసర్ రసూల్, సెరికల్చర్ సిబ్బంది, విలేజ్ వార్డ్ హెల్త్ సెక్రటరీలు, ల్యాబ్ టెక్నీషియన్ లు, ఫార్మసీ ఆఫీసర్ అబ్దుల్లా, డెంటల్ డాక్టర్ నర్సింగ్ ఆఫీసర్లు ప్రత్యేకంగా బెంగళూరు నుండి వచ్చిన సాఫ్ట్వేర్ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు పాల్గొని, నూతన వధూవరులకు శుభాకాంక్షలు, ఆశీర్వాదాలు తెలియజేశారు.

# జెత్వానీ కేసు.. వైకాపా నేత విద్యాసాగర్కు హైకోర్టులో చుక్కెదురు

ముంబయి నటి జెత్వానీ కేసులో వైకాపా నేత కుక్కల విద్యాసాగర్కు చుక్కెదురైంది.




అమరావతి,అక్టోబర్,28 (రిపబ్లిక్ న్యూస్): ముంబయి నటి జెత్వానీ కేసులో వైకాపా నేత కుక్కల విద్యాసాగర్కు హైకోర్టులో చుక్కెదురైంది. విజయవాడ కోర్టు తనపై విధించిన రిమాండ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఇటీవల ఆయన హైకోర్టును ఆశ్రయించారు. రిమాండ్ రద్దు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. విద్యాసాగర్ పిటిషన్ను కొట్టివేసింది. అరెస్టు విషయంలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది.

# రూ.వంద కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు :జనసేన కార్పొరేటర్ ఆరోపణ

రూ. వంద కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుటుంబసభ్యులు కబ్జా చేశారని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఆరోపించారు.




విశాఖ, అక్టోబర్,28 (రిపబ్లిక్ న్యూస్): రూ.వంద కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుటుంబసభ్యులు కబ్జా చేశారని జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఆరోపించారు. ఈ మేరకు మింది గ్రామస్థులతో కలిసి విశాఖ జిల్లా కలెక్టర్కి ఫిర్యాదు చేశారు. విశాఖ రెవెన్యూ డివిజన్ పరిధి గాజువాక మండలం మింది గ్రామ సర్వే నెం-47/3లో సుమారు రూ.వంద కోట్ల విలువ చేసే మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జాకు గురైన ఆ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్కు జనసేన కార్పొరేటర్, మింది గ్రామస్థులతో కలిసి పలు అంశాలను వెల్లడించారు. భూ కబ్జాపై విశాఖ జిల్లా కలెక్టర్తోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి, రాష్ట్ర సీసీఎస్ఏ కమిషనర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశుసంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖప్రత్యేక కార్యదర్శులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# తెదేపా కార్యాలయంపై దాడి కేసు..ప్రధాన నిందితుడికి రిమాండ్ పొడిగింపు

తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి ఘటనలో ఏ1గా ఉన్న పానుగంటి చైతన్యకు న్యాయస్థానం మరో 14రోజుల పాటు రిమాండ్ పొడిగించింది.



మంగళగిరి, అక్టోబర్,28 (రిపబ్లిక్ న్యూస్): తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి ఘటనలో ఏ1గా ఉన్న పానుగంటి చైతన్యకు న్యాయస్థానం 14 రోజుల పాటు రిమాండ్ పొడిగించింది. మూడు రోజుల సీఐడీ కస్టడీ ముగియడంతో అధికారులు సోమవారం గుంటూరులోని 6వ అదనపు న్యాయస్థానం ఎదుట నిందితుడిని హాజరుపరిచారు. మూడు రోజుల కస్టడీలో అధికారుల ప్రశ్నలకు చైతన్య స్పందించలేదని, అన్నింటికీ తెలియదు, గుర్తులేదు, మర్చిపోయాననే సమాధానాలిస్తూ.. విచారణకు సహకరించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం చైతన్యకు మరో రెండు వారాలు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు అతడిని కోర్టు నుంచి విజయవాడ జైలుకు తరలించారు.

# వెంకటరెడ్డి కేసు.. ఏపీఎండీసీ కార్యాలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు

ఆంధ్రప్రదేశ్ మినరల్ డెపలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు.



విజయవాడ, అక్టోబర్,28 (రిపబ్లిక్ న్యూస్): ఆంధ్రప్రదేశ్ మినరల్ డెపలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మైనింగ్ శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి కేసు విషయంలో ఏసీబీ అధికారులు ఈ సోదాలు చేస్తున్నారు. ఇసుక టెండర్ల విషయంలో జరిగిన అవకతకవల్లో వెంకటరెడ్డి అరెస్టు అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇటీవల వెంకటరెడ్డిని కస్టడీకి తీసుకొన్న ఏసీబీ అధికారులు.. పలు కీలక అంశాలపై విచారించారు. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగా సోమవారం ఉదయం నుంచి ఏపీఎండీసీ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. సోదాలకు సంబంధించి ఏసీబీ అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వర్గానికీ మేలు చేయలేదు: హరీశ్ రావు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వర్గానికీ మేలు చేయలేదని.. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేపోయిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు.



హైదరాబాద్, అక్టోబర్,28 (రిపబ్లిక్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వర్గానికీ మేలు చేయలేదని.. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేపోయిందని మాజీ మంత్రి హరీశ్రావు విమర్శించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ ధర్నాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పథకాలను కూడా సీఎం రేవంత్ కొనసాగించలేకపోతున్నారని.. బతుకమ్మ చీరలను సైతం ఇవ్వలేకపోయారని హరీశ్ రావు విమర్శించారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా తమ ప్రభుత్వ హయాంలో రైతుల కోసం రైతుబంధు ఇచ్చామన్నారు. అధికారంలోకి వస్తే రైతులకు రూ.15వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్.. గతంలో ఉన్న రూ.10వేలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. పత్తికి మద్దతు ధర రాకపోయినా సీఎం, మంత్రులు నోరుమెదపడం లేదన్నారు. అకాల వర్షాలతో ఇప్పటికే పత్తి రైతులు ఇబ్బందుల్లో ఉంటే గోరుచుట్టుపై రోకలిపోటులా వారికి మద్దతు ధర కూడా లేదని విమర్శించారు. ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మంలో రైతులు రోడ్డెక్కినా.. ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో మక్కల కొనుగోలు కేంద్రాలే ప్రారంభం కాలేదన్నారు. వడ్లు కొనుగోలుకు మంత్రులు కొబ్బరికాయలు కొట్టుడే తప్ప.. వాటిని కొనే దిక్కులేదని విమర్శించారు. వడ్లకు రూ.2,320 మద్దతు ధర రావాల్సి ఉండగా.. రూ.1800 నుంచి రూ.1900కే రైతులు అమ్ముకుంటున్న పరిస్థితి వచ్చిందన్నారు. పత్తికి రూ.7,521 మద్దతు ధర రాకపోవడంతో రూ.5,000 - రూ.5,500కే విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రక్షణశాఖ అనుమతులతోనే 'అమరన్' చేశాం : దర్శకుడు రాజ్కుమార్

కశ్మీర్ లో షూటింగ్ చాలా కష్టంగా పూర్తిచేసినట్లు అమరన్' దర్శకుడు రాజ్కుమార్ చెప్పారు. రక్షణశాఖ అనుమతులతోనే ఈ సినిమా షూటింగ్ చేసినట్లు తెలిపారు.



శివ కార్తికేయన్ హీరోగా రాజ్కుమార్ పెరియసామి తెరకెక్కించిన చిత్రం 'అమరన్' అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ సినిమాపై ఆసక్తి కలిగిస్తోంది మూవీ యూనిట్. తాజాగా దర్శకుడు రాజ్కుమార్ ఈ సినిమా షూటింగ్ విశేషాలను పంచుకున్నారు. కశ్మీర్లో చిత్రీకరణ చేయడం కష్టంగా అనిపించిందన్నారు."అమరన్' యాక్షన్ సినిమా అనుకుంటున్నారు. కానీ, ఇది ఓ సైనికుడి జీవిచరిత్ర. ఆయన కుటుంబంతో గడిపిన రోజులతో పాటు సైన్యంలో ఆయన ప్రయాణాన్ని చూపించాం. ఇందులో రాజకీయ భావజాలం ఉపయోగించలేదు. ఏ నటుడినీ దృష్టిలో పెట్టుకొని ఈ కథ రాయలేదు. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత ముకుంద్ కుటుంబాన్ని కలిశాను. వాళ్లు తమిళ హీరో అయితే బాగుంటుందన్నారు. దీంతో శివకార్తికేయన్ను ఎంపిక చేశాం. ఈ సినిమా కోసం ఆయన చాలా కష్టపడ్డారు. హీరోయిన్ పాత్ర కోసం నిబద్ధత కలిగిన నటి కావాలనుకున్నాం సాయిపల్లవి నాకు చాలారోజుల నుంచి తెలుసు. ఆమె అయితేనే ఈ పాత్రకు న్యాయం చేయగలదని అనిపించింది. ఈ సినిమా షూటింగ్ చాలా భాగం కాశ్మీర్లో జరిగింది. అక్కడ ఎప్పుడూ టెన్షన్ వాతావరణమే ఉంటుంది. కానీ అక్కడే చిత్రీకరణ చేయాలని భావించాను. రక్షణశాఖ అనుమతులు తీసుకొని షూటింగ్ పూర్తిచేశాం. స్క్రిప్ట్ అధికారులకు చూపించి వాళ్లు ఓకే అని చెప్పిన తర్వాతే చిత్రీకరణ ప్రారంభించాం. భద్రత విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం" అని చెప్పారు.'అమరన్'లో శివ కార్తికేయన్ ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఆయన ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. "తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ చాలా ప్రత్యేకం. ఈసారి నేను, మా బృందం ప్రత్యేకమైన చిత్రంతో వస్తున్నాం. ఇదొక నిజమైన హీరో కథ. ఎంతో నిజాయతీగా తెరపైకి తీసుకొచ్చారు దర్శకుడు. సాయిపల్లవికి తగిన ఇందు పాత్ర ఈ సినిమాతో దొరికింది. జీవీ సంగీతం ఎంతో బలం" అన్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# ప్లాస్టిక్ సర్జరీ రూమర్స్పై స్పందించిన నయనతార..

తన ముఖానికి ఎప్పుడూ ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోలేదని నయనతార స్పష్టంచేశారు. ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల ముఖం అలా కనిపిస్తుందన్నారు.



తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు గతంలో వచ్చిన వార్తలను నటి నయనతార 2003లో మలయాళం చిత్రంతో నయనతార ఇండస్ట్రీలోకి వచ్చారు. ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో ఆమె తొలిసినిమాలో కంటే సన్నగా కనిపించారు. దీంతో ఆమె ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారనే రూమర్స్ మొదలయ్యాయి. తాజాగా నయనతార వాటికి ఫుల్స్టాప్ పెట్టారు. ప్రస్తుతం ఆమె తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తున్నారు. గతేడాది 3 సినిమాలతో అలరించిన ఆమె.. ప్రస్తుతం ఐదు సినిమాలతో బిజీగా ఉన్నారు.ఖండించారు. తన ముఖాన్ని మార్చుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించలేదని తెలిపారు. టాలీవుడ్ తో పాటు బాలీవుడ్లో సినిమాలతో అలరిస్తోన్న నయనతార తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశంపై మాట్లాడారు. "నా కనుబొమలు అంటే నాకు చాలా ఇష్టం. వాటి ఆకారం ఎప్పుడూ మారుస్తూ ఉంటాను. ప్రతి రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ముందు వాటిని మార్చుతుంటాను. వాటి కోసం ఎంతో సమయాన్ని వెచ్చిస్తాను. కనుబొమల ఆకారం మారినప్పుడల్లా ముఖంలో మార్పు కనిపిస్తుంది. బహుశా అందుకే నా ముఖంలో మార్పులు వచ్చాయని ప్రజలు అనుకొని ఉంటారు. వాళ్లు అనుకున్నది నిజం కాదు.. అలాగే డైటింగ్ వల్ల కూడా నా ముఖంలో మార్పులు రావచ్చు. ఒక్కోసారి బుగ్గలు వచ్చినట్లు కనిపిస్తుంటాయి. మరోసారి అవి లోపలికి వెళ్లినట్లు అనిపిస్తుంటుంది. కావాలంటే మీరు నన్ను గిచ్చి చూడొచ్చు.. నా శరీరంలో ఎక్కడా ప్లాస్టిక్ ఉండదు" అని నయనతార సరదాగా చెప్పారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1867 : స్వామి వివేకానంద బోధనలకు ప్రభావితమై హిందూమతాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళ సిస్టర్ జననం (మ.1911).
- 1886: అమెరికాలోని న్యూయార్క్ లో స్టేట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహాన్ని ఆవిష్కరించిన రోజు. ఈ విగ్రహాన్ని అమెరికా కు ఫ్రాన్సు బహూకరించింది.
- 1892 : బెంగాలీ పాత్రికేయుడు లాల్ బెహారీ డే మరణం (జ.1824).
- 1892 : మోహన్దాస్ కరంచంద్ గాంధీ రెండవ కుమారుడు మణిలాల్ గాంధీ జననం. (మ.1956)
- 1900 : జర్మనీకి చెందిన భాషావేత్త, బహుభాషాకోవిదుడు మాక్స్ ముల్లర్ మరణం (జ.1823).
- 1909 : ప్రముఖ తెలుగు రచయిత కొడవటిగంటి కుటుంబరావు జననం (మ.1980).
- 1924 : సుప్రసిద్ధ తెలుగు సినిమా నటీమణి సూర్యకాంతం జననం (మ.1996). (చిత్రంలో)
- 2011 : రంగస్థల నటుడు, హరికథా భాగవతార్ దూసి బెనర్జీ మరణం.



నివేదిత




లాల్ బెహారీ డే


మణిలాల్ గాంధీ


మాక్స్ ముల్లర్


కుటుంబరావు


సూర్యకాంతం



దూసి బెనర్జీ

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# 17 కేజీలు తగ్గి.. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికై..

వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న బోర్డర్ గావస్కర్ ట్రోఫీ కోసం టీమ్ ఇండియా జట్టును ఎంపిక చేసిన విసయం తెలిసిందే. ఇందులో కోల్కతా నైట్ రైడర్స్ పేసర్ హర్షిత్ రాణా చోటు దక్కించుకున్నాడు.




ఇంటర్నెట్ డెస్క్: ఈ ఏడాది ఐపీఎల్ కోల్కతా నైట్ రైడర్స్ ట్రోఫీ నెగ్గడంలో ఆ జట్టు పేసర్ హర్షిత్ రాణా కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రతిభే అతడిని నవంబర్ నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక బోర్డర్ గావస్కర్ ట్రోఫీకి ఎంపికయ్యేలా చేసింది. ఆస్ట్రేలియా పర్యటన కోసం ఎంపికైన కొత్త ముఖాల్లో అతడు కూడా ఒకరు.మహమ్మద్ షమీ అందుబాటులో లేని కారణంగా బుమ్రా నేతృత్వంలోని పేస్ దళంలో సిరాజ్, ఆకాశ్ దీప్తో పాటు హర్షిత్ రాణాకూ చోటు దక్కింది. ఇటీవల జరిగిన దులీప్ ట్రోఫీలో 8 వికెట్లతో హర్షిత్ ఆకట్టుకున్నాడు. అయితే.. షమీ రీప్లేస్మెంట్ కోసం వెతుకున్న టీన్ఇండియాకు హర్షిత్ మొదటి ఛాయిస్ కాదట. గత ఐపీఎల్లో కోల్కతాకు ఆడిన హర్షిత్.. తన అద్భుత ప్రదర్శనతో ఆ జట్టు కోచ్ గౌతం గంభీర్ దృష్టిలో పడ్డాడు. అదే అతడిని టీమ్ ఇండియాకు ఎంపికయ్యేలా చేసిందంటున్నారు పలువురు. ఇక ఈ యువ పేసర్ టీమ్ ఇండియాకు ఎంపిక కావడం అంత ఈజీగా జరగలేదు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీకి ఎంపిక కావడం అతడి కల. ఇందు కోసం ఫిట్నెస్పై దృష్టి పెట్టాడు. తీవ్రంగా శ్రమించి 17 కేజీల బరువు తగ్గాడు.అయితే.. హర్షిత్ తొలినాళ్లలో చాలా సార్లు గాయాలబారిన పడేవాడట. ఇదే విషయం తనను ఎంతో ఆందోళనకు గురి చేసేదని అతడి తండ్రి ప్రదీప్ వెల్లడించారు. 'ఒక గాయం తర్వాత మరొకటి. ఒక్కోసారి తీవ్రంగా గాయపడేవాడు. శరీరమంతా గాయాలతోనే కనిపించేది. ఓ సమయంలో ఇక అతడు క్రికెట్ ఆడలేడేమో అనుకున్నాను. అయితే.. హర్షిత్ త్వరగా కోలుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నించాను. ఆయుర్వేద సెంటర్లకూ తీసుకెళ్లాను. నేను చేయగలిగినదంతా చేశాను" అని ప్రదీప్ పేర్కొన్నారు. తాను క్రికెటర్ గా ఎదగడం వెనక తన తండ్రి పడ్డ కఠోర శ్రమ ఉందని హర్షిత్ వివరించాడు. "నేను తరచుగా గాయాలబారినపడేవాడిని. అయితే.. నా తండ్రి నా వెనక ఒక రాయిలా నిలబడి నాకు మద్దతిచ్చాడు. నేను ప్రొఫెషనల్ క్రికెటర్ కాలేకపోయినా ఫర్వాలేదు అని చెప్పేవాడు. నేను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నానంటే అందుకు కారణం మా నాన్నే" అని పేర్కొన్నాడు. బంతులేస్తే బ్యాటర్లు భయపడాలని చెప్తూ అథ్లెట్, వెయిట్ లిఫ్టర్ అయిన తన తండ్రి ఎప్పటికప్పుడూ తనలో స్ఫూర్తి నింపేవాడని హర్షిత్ తెలిపాడు. ఇక ఇంగ్లాండ్ లో తాను ఆడటం చూడాలనేది తన తండ్రి కల అని.. అయితే తాను మాత్రం ఆస్ట్రేలియాతో ఆడాలని అనుకునేవాడినని హర్షిత్ చెప్పాడు. పోటీతత్వం అంటే తనకెంతో ఇష్టమని.. ఆసీస్ కూడా అదే తరహా క్రికెట్ ఆడుతుందని వివరించాడు. ఆస్ట్రేలియా పర్యటన కోసం తాను ఎంతగానో ఎదురు చూస్తున్నట్లు 22 ఏళ్ల ఈ దిల్లీ కుర్రాడు చెప్పాడు.ఐపీఎల్ లో ప్రదర్శనతో శ్రీలంక, జింబాబ్వే, బంగ్లాదేశ్తో సిరీస్లకు జట్టులో హర్షిత్ రాణా ఉన్నప్పటికీ అరంగేట్రం చేసే అవకాశం రాలేదు. ఇప్పుడు ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికయ్యాడు. 6.2 అడుగుల ఎత్తు ఉండే హర్షిత్ 140 కిలోమీటర్ల వేగంతో విసిరే బౌన్సర్లను ఆడటం బ్యాటర్లకు సవాలే.


## అంధం

కొన్నిసార్లు క్యాన్సర్ వచ్చే ముందు ఎలాంటి లక్షణాలు కనిపించవు. అయితే, మరికొన్ని క్యాన్సర్స్ మాత్రం లక్షణాలని చూపిస్తాయి. వాటిని మనం ముందుగానే గుర్తించాలి. లేదంటే సమస్య తీవ్రత పెరిగి ట్రీట్మెంట్ చేసినా ఉపయోగం ఉండదు. ఇక టంగ్ క్యాన్సర్ సమస్య వస్తున్నప్పుడు నోటిపై కొన్ని కణాలు పెరుగుతాయి. ఇవి అక్కడితో ఆగకుండా నోటిలో అనేక భాగాలకు వ్యాపిస్తాయి. ఈ క్యాన్సర్ అనేది గొంతులో కూడా రావొచ్చు. నాలుకపై ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు మీరు ఏం తినలేరు. తాగలేరు. మాట్లాడడానికి కూడా ఇబ్బందిగా ఉంటుంది. లక్షణాలను గమనించిన వెంటనే డాక్టర్ని కలవడం చాలా మంచిది. దీని వల్ల ఎర్లీ స్టేజ్లోనే క్యాన్సర్ని తరిమి కొట్టొచ్చు.






# నాలుకపై ఇలా ఉంటే క్యాన్సర్ వచ్చినట్లే.. ముందుగా గుర్తించకపోతే కష్టమే






### క్యాన్సర్స్ రకాలు..



నోటి క్యాన్సర్ : దీనిని కాస్తా ఈజీగానే గుర్తుపట్టొచ్చు. నాలుకపై సమస్యగా ఉంటుంది. పుండు, వాపు వస్తుంది. వీటిని గమనించగానే డాక్టర్ని కలవాలి.

గొంతులో క్యాన్సర్ : ఈ క్యాన్సర్ని ఓరోఫారింజియల్ టంగ్ క్యాన్సర్ అంటారు. ఈ సమస్యలో అంత త్వరగా లక్షణాలు కనిపించవు. కొంతవరకూ క్యాన్సర్ వచ్చాక నాలుక వెనుక భాగంలో పెరిగినప్పుడు గుర్తించలేం.

### ప్యాచెస్..



మనకి అప్పుడప్పుడు నాలుకపై తెలుపు, ఎరుపు రంగుల్లో ప్యాచెస్ ఏర్పడతాయి. ఇవి అంత త్వరగా పోవు. కనీసం 3 వారాలైనా ఉంటాయి. దీంతో చాలా ఇబ్బందిగా ఉంటుంది. నొప్పి, మంటగా ఉంటుంది. ఇది కొన్నిసార్లు నాలుక, నోరు, దవడ, మెడ, చెవిలో కూడా నొప్పిగా ఉంటుంది. నాలుక, దవడ నమిలినా, కదిలినా నొప్పి ఎక్కువగా ఉంటుంది. అంత త్వరగా తగ్గదు. నాలుక తిమ్మిరిగా కూడా ఉంటుంది.

### పుండ్లు..




నాలుకపై ఎరుపు, బూడిద రంగులో పుండు లేదా వాపు ఉండి నొప్పి ఎక్కువగా ఉంటుంది. మనం బ్రష్ చేసినా నోటి నుంచి అదో రకమైన వాసన వస్తుంటుంది. దీంతో మాట్లాడడం కష్టంగా ఉంటుంది. దీనిని కూడా మనం అనుమానించాల్సిందే.

### గొంతునొప్పి..



ఇది గొంతు దగ్గర్లో ఉన్నట్లైతే గొంతు నొప్పి ఉంటుంది. మాట తేడాగా మారుతుంది. బొంగురుపోయినట్లుగా మాట వస్తుంది. గొంతులో ఏదో ఇరుక్కున్నట్లుగా ఉంటుంది. ఏం చేసినా గొంతు నొప్పి తగ్గదు.

### కారణాలు..



1.ఎక్కువగా స్మోక్ చేయడం
2.ఆల్కహాల్ తీసుకోవడం
3.పొగాకు పదార్థాలు తీసుకోవడం
4.తమలపాకులు
5.ఇంట్లో ఎవరికైనా ఇదివరకే క్యాన్సర్ ఉంటే జన్యు కారణాల కారణంగా వస్తుంది.
6.నాలుపై ఉన్న ఆరోగ్య కణాల %ణచీూ% మారి విపరీతంగా పెరిగినప్పుడు
7. వైరస్ కారణంగా కూడా క్యాన్సర్ వస్తుంది.

### ట్రీట్మెంట్..



ఈ సమస్యకి ట్రీట్మెంట్ మీకు వచ్చిన క్యాన్సర్ని బట్టి ఉంటుంది. ముందుగా మీరు డాక్టర్ని సంప్రదిస్తే సమస్య ఏంటి, ఎలా వచ్చింది. ఎంత వరకూ సమస్య పెరిగిందో గమనిస్తారు. ఆ తర్వాత మీకు రేడియేషన్, కీమో, ఇమ్యూనో, సర్జరీ ఈ ట్రీట్మెంట్స్లో ఏవి అవసరమో వాటిని ప్రారంభిస్తారు.

గమనిక : ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.